సాక్షి నల్లగొండ

బుధవారం, 14, జూన్, 2023



చెర్వుగట్టు గుట్టపై మంటలు

చెర్వుగట్టు పార్వతిజడలరామలింగేశ్వర స్వామి గుట్టపై మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. - 8లో



'మన ఊరు-మన బడి' భేష్

'మన ఊరు-మన బడి' బేషుగ్గా ఉందని కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ అమర్‌ప్రీత్ దుగ్గల్ అన్నారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40°/30°

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): జిల్లాలోని బీసీ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్లు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వద్ద మూడేళ్ల శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జూన్ 30వ తేదీ లోపు జిల్లా బీసీ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

ఐటీ టవర్ సందర్శన



ఐటీ టవర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ సుధీర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని ఐటీ టవర్ భవన నిర్మాణాన్ని మంగళవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఎన్నారై, న్యూమరీ టెక్నాలజీ సంస్థ అధిపతి సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ వీణ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అమెరికాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పంద కంపెనీల ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఐటీ హబ్ నుంచి వివిధ కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఐటీ టవర్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



దేవరకొండ రోడ్డులోని ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీఏఓ సుచరిత

రామగిరి(నల్లగొండ): డీలర్లు పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి వై.సుచరిత అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి కచ్చితంగా రశీదు తీసుకొని పంటకాలం అయిపోయే వరకు భద్రపరచుకోవాలన్నారు. సాగు, ఇతర సలహాలకు దగ్గరలోని క్లస్టర్ ఏఈఓ, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు. ఆమె వెంట వ్యవసాయ అధికారులు పి.శ్రవణ్ కుమార్, సుమన్‌లు ఉన్నారు.

కనగల్ ఎస్‌ఐగా అంతిరెడ్డి

కనగల్: నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.అంతిరెడ్డిని కనగల్ ఎస్‌ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ అపూర్వరావు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ నగేష్‌ను నల్లగొండ వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు. అయితే నగేష్‌పై అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలోనే ఆయనపై ఎస్పీ బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. కాగా ఎస్‌ఐ నగేష్ మంగళవారం సాయంత్రం వరకు స్టేషన్‌లో అందుబాటులో లేకుండా ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. ఇదే విషయాన్ని సాయంత్రం స్టేషన్‌కు వచ్చిన ఎస్‌ఐని వివరణ కోరగా అనారోగ్యం కారణంగా స్టేషన్‌కు రాలేకపోయానని తెలపడం గమనార్హం.

18న నల్లగొండ, సూర్యాపేట బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

మిర్యాలగూడ టౌన్: ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ జూనియర్ విభాగం పోటీలకు గాను నల్లగొండ, సూర్యాపేట బాలబాలికల జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 18న మిర్యాలగూడలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి తోట రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జట్ల ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో పొందిన ఒరిజినల్ జనన ధ్రువీకరణం, ఆధార్ కార్డులను తీసుకురావాలని కోరారు. జట్ల ఎంపిక తరువాత ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కోచ్ రామకృష్ణ సెల్: 9948052108 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

● 'మహిళా' సంబురం





తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో మహిళను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, వేడుకలకు హాజరైన మహిళలు, అధికారులు తదితరులు

దిగుబడి, కొనుగోలులో మొదటి స్థానం

లక్ష్యానికి మించి ధాన్యం సేకరణ

- 6.31లక్షల మెట్రిక్ టన్నులకు గాను కొన్నది 6.75 లక్షల మెట్రిక్ టన్నులు
- అత్యధికంగా నల్లగొండ నియోజకవర్గంలోనే..
- ముగిసిన యాసంగి వడ్ల కొనుగోళ్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్రంలో ధాన్యం దిగుబడులు పెరగడంతో దానికి అనుగుణంగా ప్రభుత్వం కూడా కొనుగోళ్లు చేపట్టింది. రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల కంటే నల్లగొండ జిల్లాలోనే దిగుబడి అధికంగా రావడంతోపాటు ధాన్యం కొనుగోళ్లలో కూడా ముందంజలో ఉంది. జిల్లాలో అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని మించి 6,75,995 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో చూస్తే 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నల్లగొండ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది.

యంత్రాంగం ప్రత్యేక చొరవ

జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో సన్నాలు మిల్లర్లు కొనగా, సాధారణ రకం కల్లాల్లో కొనుగోలు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖ ఈ సారి 5 లక్షల మెట్రిక్ టన్నుల సాధారణ రకం ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తుందని అంచనా వేసింది. దానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. దాదాపు రెండు నెలల పాటు జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాలు, మిల్లులు పర్యటించి ఏ సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పని చేశారు. సోమవారం నిర్వహించే ప్రజావాణిని కూడా మూడు వారాలు రద్దు చేసి మరీ ధాన్యం కొనుగోళ్లపైనే దృష్టి పెట్టారు. దీంతో రాష్ట్రంలో ముందుగా కొనుగోళ్లను పూర్తి చేయడంతోపాటు రాష్ట్రంలోనే మిగితా జిల్లాలతో పోల్చితే నల్లగొండలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేశారు.

92,380 మంది రైతుల నుంచి..

జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్ను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనాల్సి వస్తుందని అంచనా వేసినా, దిగుబడి అధికంగా రావడంతో లక్ష్యం మరింగా పెరిగింది. దీంతో జిల్లా యంత్రాంతం 6,31,467 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ముందుగా 246 కొనుగోలు కేంద్రాలనే ప్రారంభించినా ఆ తరువాత మరో వంద కేంద్రాలు ఏర్పాటు చేసి మరీ 92,380 మంది రైతుల నుంచి రూ.1392.55 కోట్ల విలువైన 6,75,995 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది.

నియోజకవర్గాల వారీగా కొనుగోలు చేసిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో..)

నల్లగొండ	నకిరేకల్	నాగార్జునసాగర్
1,80,551	1,65,262	1,40,513
దేవరకొండ	మునుగోడు	మిర్యాలగూడ
71,992	34,024	57,729

తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని శాలిగౌరారం మండలంలో 25,924 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు

కొనుగోళ్లలో మనమే ముందున్నాం..



యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ముందంజలో ఉంది. ఇప్పటివరకు జిల్లాలోనే అత్యధికంగా కొనుగోలు చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రణాళికబద్ధంగా ముందుకుసాగాం. పౌరసరఫరాల సంస్థ, పౌర సరఫరాల శాఖ, సంబంధిత ఇతర శాఖ అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రశాంతంగా కొనుగోళ్లు పూర్తి చేశాం. అక్కడక్కడా చిన్నపాటి సమస్యలు తలెత్తినా అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్నాం.

– భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..

- ప్రజల కష్టాలన్నీ త్వరలోనే తీరుతాయి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- గుర్రంపోడు మండలంలో రెండో రోజు కొనసాగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



గుర్రంపోడులో కొనసాగుతున్న భట్టి విక్రమార్క పాదయాత్ర

గుర్రంపోడు: వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని..మీ కష్టాలన్నీ తీరుతాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు భరోసా ఇచ్చారు. గుర్రంపోడు మండలంలో ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఉదయం జిన్నాయిచింత స్టేజి వద్ద ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా రోడ్డు వెంట ఉన్న కూలీలను, మహిళలను, వృద్ధులను పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. వద్దిరెడ్డిగూడెం వద్ద రోడ్డు పక్కన గీతకార్మికుడు రాజు, జ్యోతి దంపతులు గీత కార్మికులకు చెట్లు ఎక్కాలంటే కష్టంగా ఉందని 45 ఏళ్లకే ఫించన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. వద్దిరెడ్డిగూడెం గ్రామంలో జరిగిన రచ్చబండలో రైతులు వద్దిరెడ్డి ఈశ్వరమ్మ, భద్రారెడ్డి, సిద్దారెడ్డి, మేకల కృష్ణారెడ్డి తదితరులు సీఎల్పీ నేతతో మాట్లాడుతూ తమకు రుణమాఫీ కాలేదని, మాఫీ అవుతుందని వడ్డీ కట్టలేదని, తీసుకున్న అప్పు వడ్డీతో సహా మాఫీ చేయాలని కోరారు. పండించిన పంటకు మద్దతు ధర లేదని, ఎరువుల ధరలు పెరిగి సేద్యం భారంగా మారిందని పలువురు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మీకు మేలు జరుగుతుందని, రూ. రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో జరుగుతుందని హామీ ఇచ్చారు. రైతుబంధులాగా కూలీబంధు ఇస్తామని, ప్రతి కుటుంబానికి 12 వేల సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందిస్తామని భరోసా కల్పించారు. ఇప్పుడున్న వంట గ్యాస్ ధర 1,200 రూపాయల బదులు రూ.500లకే సిలిండర్ అందిస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన విధంగా 9 రకాల రేషన్ సరకులు ఇస్తామని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసి గ్రావిటీ ద్వారా సాగు నీరు అందిస్తామని చెప్పారు. పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, కుప్ప రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, జాల చినసత్తయ్య యాదవ్, మేడి వెంకన్న, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వద్దిరెడ్డిగూడెం వద్ద గీతకార్మికుడితో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రభుత్వ స్కూళ్లను ప్రజలే కాపాడుకోవాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మునుగోడు: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ స్పందన వేదిక నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ఏ ఒక్క పాఠశాలను కూడా ప్రభుత్వం మూసివేయదన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రజలు దానిని గమనించకుండా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం చేసే అంగు ఆర్భాటాలకు ఆకర్షితులై ఆయా పాఠశాలల్లో చేర్పించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు పునరాలోచన చేసుకొని ప్రైవేట్ చేర్పించిన తిరిగి తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అప్పుడే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతుందన్నారు. కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ పాఠశాలల్లో వెంటనే కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ వేదిక జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హెచ్‌ఎం రమేష్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఐతగోని లాల్‌బహదూర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ, సూర్యాపేటలో ట్రామా కేర్ సెంటర్లు

- మెడికల్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటుకు రూ.47.50కోట్లు మంజూరు

సూర్యాపేట : జాతీయ రహదారులతో పాటు సమీప ప్రాంతాల్లో జరిగే రోడ్డు ప్రమాద బాధితులను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడేందుకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో రెండు ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ.47. 50 కోట్లు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసింది. సూర్యాపేట, నల్లగొండ జిల్లా కేంద్రాల్లోని మెడికల్ కళాశాలల ప్రాంగణాల్లో ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాల్లో రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్సలకు సరిపడా ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తేనున్నారు. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఉన్నందున సూర్యాపేటలో, హైదరాబాద్ – అద్దంకి జాతీయ రహదారిపై ఉన్నందున నల్లగొండలో ఈ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా మెడికల్ కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉండడంతో రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులకు వైద్యం సులువుగా అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అత్యవసర చికిత్సల కోసం సుదూర ప్రాంతాలకు తరలి వెళ్లి సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే క్షతగాత్రులను కాపాడడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయి. ఆక్సిజన్ సౌకర్యంతో పాటు 24 గంటలూ అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాను సన్మానిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, చిత్రంలో ఎమ్మెల్యే భగత్

- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, సాగర్ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు: తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అదనపుకలెక్టర్ ఖుష్బూ గుప్తా, సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిడమనూరులో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటయ్యాక కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం మహిళల సంక్షేమ కోసం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల సాయంతో మహిళలు ఎదుగుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రూ.22.4 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా మహిళలు బోనాలు, బతుకమ్మలతో అదనపు కలెక్టర్, ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం గురించి వివరించే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, జవ్వాజి వెంకటేశం, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, జయరాం, కర్ణ అనూష, స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ కాళిందిని, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, తహసీల్దార్ ప్రమీల, మాలె అరుణ, ఎంపీపీ జయమ్మ, కళావతి, శ్రీలత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

కస్తూరిబా పాఠశాలల్లో సీట్ల కొరత

- అడ్మిషన్ల కోసం తల్లిదండ్రుల అవస్థలు
- జిల్లాలో 27 మండలాల్లోనే పాఠశాలలు
- ఐదు చోట్ల ఏర్పాటు చేయని ప్రభుత్వం
- ఒక తరగతికి ఒకటే సెక్షన్
- పిల్లలను చేర్పించేందుకు వెళితే సీట్లు లేవంటున్న ఎస్‌ఓలు



తమ పిల్లల అడ్మిషన్ కోసం మంగళవారం మునుగోడు కస్తూరిబా పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు

మునుగోడు: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థినులు అధిక సంఖ్యలో తరలివస్తున్నా సీట్లు లేవనే మాటలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని అన్ని మండలాల్లో కస్తూరిబా గాంధీ పాఠశాలలు లేకపోవడంతో గ్రామీణ బాలికలు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే అవకాశం లభించడం లేదు. 20 ఏళ్ల నుంచి విడతల వారీగా జిల్లాలో వివిధ మండలాల్లో ప్రభుత్వం కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత హాస్టల్ వసతితో కూడిన విద్యాబోధన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు, చదువు మధ్యలో మానేసి వారితోపాటు ముఖ్యంగా తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినులు, స్థానికంగా ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఆడపిల్లలను ఈ పాఠశాలల్లో చేర్చుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పాఠశాలలు ప్రారంభించిన మొదట్లో నామమాత్రం నడిచినప్పటికీ ప్రస్తుతం ఇంగ్లిష్ మాధ్యమంలో పక్కాగా విద్యాబోధన చేస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తుండడంతో తీవ్రమైన పోటీ నెలకొంది.

ఆరో తరగతిలోనే ప్రవేశ అవకాశం..

కస్తూరిబాగాంధీ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన చేస్తున్నారు. అయితే ఈ పాఠశాల్లో ప్రవేశానికి ఆరో తరగతిలోనే ఉంటుంది. ఇది కూడా ప్రవేశ పరీక్ష లేకుండా అడ్మిషన్ కల్పిస్తారు. అయితే ఏటా 6వ తరగతిలో చేరిన విద్యార్థినులు మరుసటి సంవత్సరం 7వ తరగతికి వెళ్తుండడంతో 6వ తరగతిలో సీట్లు ఖాళీ అవుతున్నాయి. ఒక్కో పాఠశాలలో కేవలం 40 సీట్లు మాత్రమే ఉండడంతో వాటి కోసం తీవ్ర పోటీ నెలకొంటుంది. మిగిలిన 7, 8, 9, 10 తరగతుల్లో అప్పటికే చేరి ఉన్నవారిలో ఎవరైనా వెళ్లిపోతే తప్ప కొత్త వారిని చేర్చుకునే అవకాశం ఉండదు. దీంతో పైతరగతుల్లో చేరాలనుకునే విద్యార్థినుల తల్లిదండ్రులు రోజూ కేజీబీవీల చుట్టూ తిరుగుతున్నా సీట్లు లేవని చెబుతుండడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు.

నూతన పాఠశాలలు ప్రారంభిస్తే..

జిల్లా వ్యాప్తంగా 32 మండలాలు ఉండగా ప్రస్తుతం 27 మండలాల్లోనే కేజీబీవీలు ఉన్నాయి. నల్లగొండ, చిట్యాల, నకిరేకల్, నార్కట్‌పల్లి, గట్టుప్పలతో కలిపి ఐదు మండలాల్లో ఇప్పటి వరకు పాఠశాలలు ప్రారంభించలేదు. ఈ ఐదు మండలాల్లో కేజీబీవీలను ప్రారంభిస్తే ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో చేరేవారి సంఖ్య తగ్గనుంది. ఇప్పటికే ప్రారంభించిన ఒక్కొక్క పాఠశాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్కో క్లాస్‌కు 40 మంది చొప్పున 200 మంది ఉండాల్సి ఉండగా ఒక్కొక్క తరగతితో 5నుంచి 10 మంది వరకు అదనంగా చేర్చుకున్నారు. దీంతో ఒక్కో పాఠశాలలో దాదాపు 220 నుంచి 230 మంది చొప్పున మొత్తం 5,940 నుంచి 6,287మంది ఉన్నారు. పాఠశాలలు లేని నల్లగొండ, చిట్యాల, నకిరేకల్, నార్కట్‌పల్లి, గట్టుప్పల మండలాల్లో కూడా నూతన పాఠశాలలు ప్రారంభిస్తే ఆయా పాఠశాలల్లో మరో వెయ్యి మంది చదివే అవకాశం లభించనుంది. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి కేజీబీవీలు లేని మండలాల్లో వెంటనే ఏర్పాటు చేయాలని, అలాగే ఇప్పుడు నడుస్తున్న పాఠశాలల్లో అదనంగా వసతులు కల్పించి, సరిపడా స్టాఫ్‌ను నియమించి తరగతికి రెండు సెక్షన్లు చేసి అధిక సంఖ్యలో బాలికలు చదువుకునేలా అవకాశం కల్పించాలని వివిధ మండలాల ప్రజలు కోరుతున్నారు.

సీట్లు లేవంటున్నారు..



మా స్వగ్రామంలో పనులు లేక బతుకు దెరువు కోసం కరీంనగర్‌కు వలస వెళ్లి జీవిస్తున్నాం. మా కుమార్తె 8వ తరగతి చదువుతుంది. ఆమె చదువు మధ్యలో మాన్పించకుండా మునుగోడు కేజీబీవీలో చేర్పించేందుకు వెళితే సీట్లు లేవని చెబుతున్నారు. ఎలాగైనే సీటు ఇచ్చి ఆదుకోవాలి.

– రూపని ధనమ్మ, విద్యార్థిని తల్లి, చీకటిమామిడి, మునుగోడు మండలం

రోజుకు వంద మందికిపైగా వస్తున్నారు



పాఠశాల ప్రారంభం కాక ముందు నుంచి రోజుకు వంద మందికిపైగా విద్యార్థినుల తల్లిదండ్రులు మా పాఠశాలలో చేర్పించాలని వస్తున్నారు. కానీ 6వ తరగతిలో మాత్రమే 40 మందిని చేర్చుకునే అవకాశం ఉంది. మిగిలిన ఏ తరగతిలోనూ ఖాళీలు లేవు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియచేశాను.

– జె.సంధ్యారాణి, స్పెషల్ అధికారి, మునుగోడు కేజీబీవీ

అనాథ పిల్లలను చేర్చుకుంటున్నాం..



అనాథ బాలికలు, స్థానికంగా ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వసల వెళ్లే వారి పిల్లలను కస్తూరిబాల్లో చేర్చుకుంటున్నాం. మిగిలిన బాలికలు సైతం ఇందులో చేరేందుకు వస్తున్నారు. సరిపడా విద్యార్థినులు ఉండటంతో కొత్తవారిని చేర్చుకోలేకపోతున్నాం. కేజీబీవీలు లేని 5 మండలాల్లోనూ ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించాం.

–జి.సరిత, జీసీడీఓ, నల్లగొండ

క్లుప్తంగా

నాలుగు స్కూల్ బస్సులపై కేసులు నమోదు



కేసులు నమోదు చేస్తున్న డీటీఓ సురేందర్‌రెడ్డి

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో రవాణా శాఖ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీటీఓ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో సరైన ఫిట్‌నెస్ లేకుండా, అర్హత లేని వ్యక్తులతో డ్రైవింగ్ చేయిస్తున్న రెండు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన నాలుగు బస్సులను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. బస్సులను భువనగిరిలోని రవాణా శాఖ కార్యాలయానికి తరలించారు.

చెరువులో పడి విద్యార్థి మృతి



సాయితేజ (ఫైల్)

ఆలేరురూరల్: చెరువులో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు గ్రామానికి చెందిన కటికె వెంకటేష్ కుమారుడు కటికె సాయితేజ(14) ఆలేరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం సాయితేజ్ పశువులకు మేత వేయడానికి తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో సమీపంలో ఉన్న చెరువు ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఉదయం 10గంటలు అవుతున్నా కొడుకు ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో తండ్రి వెంకటేష్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సమీపంలోని చెరువు కట్టపై సాయితేజ చెప్పులు, సైకిల్ కనిపించడంతో విషయాన్ని వెంటనే గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు వచ్చి చెరువులో గాలించగా సాయితేజ మృతదేహం బయటపడింది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ జి. వెంకటశ్రీను తెలిపారు.

వైభవంగా నారసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్రనామార్చన, కుంకుమార్చనలు గావించారు. అదేవిధంగా నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తిగట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు పద్మనాభాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- డీసీఎంను వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఘటన



ఘటనా స్థలంలో అశోక్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

మునగాల(కోదాడ): మునగాల మండలంలోని మాధవరం శివారులో మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మునగాల ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉషోదయ జ్యోతి యాడ్స్ సంస్థలో ఫ్లెక్సీ వర్కర్‌గా పనిచేస్తున్న ముష్టం అశోక్(29) హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడేనికి ఉషోదయ సూపర్ మార్కెట్‌కు సంబంధించిన డీసీఎం(టీఎస్ 08 యూజీ 5886)లో నిత్యావసర సరుకులు తీసుకొని వెళ్తున్నాడు. మార్గమధ్యలో మునగాల మండలం మాధవరం గ్రామ శివారులోకి రాగానే డీసీఎంను వెనుక నుంచి ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్ బస్సు (టీఎస్ 12 యూడీ 9638) ఢీకొట్టింది. దీంతో డీసీఎం జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, డీసీఎంలోనే ఉన్న మరో వ్యక్తి హనుమాచారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం అశోక్ మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి, చికిత్స నిమిత్తం హనుమాచారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ముష్టం కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం సంగెం గ్రామానికి చెందిన తాదూరి లింగస్వామి(33) దండుమల్కాపురంలోని ఇండస్ట్రీయల్ పార్కులో పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి డ్యూటీ ముగించుకున్న తర్వాత లింగస్వామి ఇండస్ట్రీయల్ పార్కు సమీపంలోనే జాతీయ రహదారిపై అవతలి వైపు ఉన్న ఆంథోల్ మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇటు వైపు వచ్చేందుకు హైవే దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మంగళవారం మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

లారీ వెనుక టైర్ల కింద పడి డ్రైవర్..

దేవరకొండ: లారీ వెనుక టైర్ల కిందపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి దేవరకొండ పట్టణ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మల్లె వెంకటేశ్వర్‌రావు(30) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం లారీలో సర్ఫ్ లోడ్‌తో జడ్చర్ల నుంచి విజయవాడకు బయల్దేరాడు. రాత్రి 10:30గంటల సమయంలో దేవరకొండ పట్టణ శివారుకు చేరుకోగానే లారీ ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ అదుపుతప్పి ఎడమ వైపుకు వెళ్లింది. డ్రైవర్ సీట్లో ఉన్న వెంకటేశ్వర్‌రావు తన పక్కన ఉన్న డోర్ పెట్టకపోవడంతో కుడి పక్కకు పడిపోయాడు. దీంతో లారీ వెనుక టైర్లు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి సీతారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని మున్సిపల్ ఉద్యోగి బలవన్మరణం

- ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఫిర్యాదు

నల్లగొండ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుని మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ దుర్గాకాలనీలో చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. బీటీఎస్ దుర్గాకాలనీకి చెందిన పప్పుల ఓంప్రకాష్(53) నల్లగొండ మున్సిపాలిటీలో వాటర్ ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. తన సహచర ఉద్యోగి చింత ఎల్లయ్య శ్రీరాం చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బులు అప్పుగా తీసుకోగా ఓంప్రకాష్ షూరిటీ సంతకం చేశాడు. కాగా ఎల్లయ్య సక్రమంగా డబ్బులు చెల్లించకపోవడంతో ఇటీవల ఓంప్రకాష్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.10వేలు కట్ చేశారు. అయితే ఓంప్రకాష్ కుమార్తె గర్భవతి కావడంతో ఆమెకు వైద్యం చేయించేందుకు అతడి భార్య పప్పుల లక్ష్మమ్మ హైదరాబాద్‌కు వెళ్లింది. మంగళవారం ఓంప్రకాష్ కుమారుడు చరణ్‌తేజ స్నేహితులను కలిసేందుకు బయటకు వెళ్లాడు. అదే సమయంలో ఓంప్రకాష్ ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన చరణ్‌తేజ్ ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఓంప్రకాష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే చరణ్‌తేజ్ తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఓంప్రకాష్ మృతిచెందాడు. చరణ్‌తేజ్ ఈ విషయాన్ని తల్లికి, పోలీసులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఇంటిని చుట్టుముట్టిన మంటలు



ట్యాంకర్ సహాయంతో మంటలు ఆర్పుతున్న స్థానికులు

పాలకవీడు: వరి కొయ్యలను తగలబెట్టేందుకు పొలాల్లో వేసిన మంటలు సమీపంలోని ఇంటిని చుట్టుముట్టాయి. ఈ ఘటన పాలకవీడు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు తమ పొలాల్లో వరి కొయ్యలకు నిప్పుపెట్టగా.. మంటలు సమీపంలోని ఇంటిని చుట్టుముట్టాయి. స్థానికులు ట్యాంకర్ సాయంతో మంటలను అదుపు చేశారు. అదేవిధంగా విద్యుత్ వైరుకు మంటలు అంటుకుని తెగిపడడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

గేదెల చోరీ కేసులో నలుగురు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామలింగారెడ్డి

హుజూర్‌నగర్: గేదెల దొంగతనానికి పాల్పడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ రూ3.50లక్షల నగదు, నాలుగు గేదెలను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని తన కార్యాలయంలో సీఐ రామలింగారెడ్డి విలేకరులకు వివరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన అమరబోయిన మట్టపల్లి ఈ నెల 3వ తేదీన తన నాలుగు గేదెలు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని గమలపహాడ్‌కు చెందిన వారిని విచారించారు. విచారణలో భాగంగా దాచేపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చాట్ల శరత్, గమలపహాడ్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గోనె రామారావు, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం నర్లింగులగూడేనికి చెందిన మాలమంతి మోహన్‌రావు, దాచేపల్లి మండలం ఇర్కిపల్లికి చెందిన మల్లా నాగరాజు, ఒంగోలు జిల్లా టంగుటూరు మండలం కరుమంచుకు చెందిన పార్ది శ్రీకాంత్, దాచేపల్లి మండలం గామాలపహాడ్‌కు చెందిన ఆటో డ్రైవర్ అలంకెమల్ల నాగేంద్రబాబు, షేక్ బాజీ, గోనె సైదారావు కలిసి గేదెల దొంగతనానికి పాల్పడుతున్నారని తేల్చారు. వీరిలో చాట్ల శరత్, గోనె రామారావు, మాలమంతి మోహన్‌రావు, మల్లా నాగరాజును మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిని విచారించగా తాము 8మంది కలిసి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి, పాలకవీడు, హుజూర్‌నగర్, మేళ్లచెరువు మండలాల్లోని వివిధ గ్రామాలలో గేదెలను దొంగిలించి బొలేరో, టాటా ఏస్ వాహనాలలో ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు గేదెలు, రూ.3.50లక్షల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. మిగతా వారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మఠంపల్లి, హుజూర్‌నగర్ ఎస్‌ఐలు బాలకృష్ణ, వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దత్తాయపల్లిలో ఇద్దరు చిన్నారులు అదృశ్యం



పిట్టల విజయ్



పిట్టల చరణ్

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లిలో మంగళవారం ఇద్దరు చిన్నారులు అదృశ్యమయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మునిరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన దీవిందర్‌రావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య యాదమ్మకు ఇద్దరు కుమారులు విజయ్(15), చరణ్(9) సంతానం కాగా, రెండో భార్య స్వరూపకు ఇద్దరు కుమార్తెలు సంతానం. యాదమ్మ బతుకుదెరువు నిమిత్తం పెద్ద కుమారుడు విజయ్‌తో కలిసి తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి వలస వచ్చి స్థానికంగా కోళ్లఫారంలో పనిచేస్తుంది. దీవిందర్‌రావు ఇద్దరు భార్యల వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం దీవిందర్‌రావు ప్రమాదవశాత్తు చింతచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. అప్పటివరకు యాదమ్మ చిన్న కుమారుడు చరణ్ మునిరాబాద్‌లో స్వరూప దగ్గర ఉండగా, అతడిని కూడా దత్తాయపల్లికి తీసుకువచ్చింది. కాగా విజయ్, చరణ్ మంగళవారం సాయంత్రం 3గంటల వరకు తల్లితోనే కోళ్లఫారం ఉన్న పిల్లలిద్దరూ.. తల్లి నిద్రపోతున్న సమయంలో ఇంటి ముందు ఉన్న టీవీఎస్ ఎక్సెల్ బండితో పాటు ఇంట్లోని రూ.2వేలు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం వరకు వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో యాదమ్మ చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువులకు ఫోన్ చేసి అడిగినా పిల్లల సమాచారం తెలియరాలేదు.

వ్యక్తిపై గొడ్డలితో హత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

మర్రిగూడ: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల వైన్స్‌ల వద్ద మంగళవారం రాత్రి 9.30గంటల సమయంలో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. స్థానిక ఎస్‌ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చర్లగూడెం గ్రామానికి చెందిన బండ శ్రీను మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల వైన్స్‌ల వద్ద ఉండగా.. అదే సమయంలో చర్లగూడెం గ్రామానికే చెందిన అతడి స్నేహితుడు మాదగోని శ్రీను, రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన శ్రవణ్‌తో కలిసి గొడ్డలితో బండ శ్రీనుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన బండి శ్రీనును మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బండ శ్రీను తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రి కొండపై రెండు దుకాణాలు సీజ్

- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వాటర్ బాటిళ్లు అమ్ముతుండడంతో చర్యలు



వివరాలు నమోదు చేసుకుంటున్న లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలోని బస్టాండ్, విష్ణు పుష్కరిణి వద్ద వర్తక సంఘం దుకాణాలపై లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్. సంజయ్‌కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. భక్తుల వద్ద వాటర్ బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.5 వసూలు చేయడంతో వర్తక సంఘానికి చెందిన రెండు దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటర్ బాటిల్‌పై అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని, ఈ మేరకు జిల్లా లీగల్ మెట్రాలజీ సిబ్బందితో కలిసి కొండ పైకి చేరుకొని రెండు దుకాణాల్లో వాటర్ బాటిల్స్ కొనుగోలు చేయగా.. రూ.20 ఉన్న బాటిల్‌పై అదనంగా రూ.5 వసూలు చేయడంతో వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. కాగా నెల రోజుల క్రితమే వాటర్ బాటిల్‌పై భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సాక్షి దినపత్రికలో ''నారసింహా.. ఇదేమి దోపిడీ'' శీర్షికన కథనం ప్రచురితం కావడం గమనార్హం.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



వీరమల్లయ్య మృతదేహం

గుండాల: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఏనుగు వీరమల్లయ్య(63) రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చేతులు, నడుము నొప్పులతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. నొప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెందిన వీరమల్లయ్య ఈ నెల 11న తన వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి తన తమ్ముడి కుమార్తె సంతోషకు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆమె అదే గ్రామానికి చెందిన మాటూరి కాశయ్య, గుజ్జ కొమురయ్యకు విషయం తెలియజేసింది. వారు వెంటనే వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే వీరమల్లయ్య అపస్మారక స్థితిలో ఉండగా, అతడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం మృతుడి భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

చెర్వుగట్టు గుట్టపై చెలరేగిన మంటలు



చెర్వుగట్టు గుట్టపై కాలభైరవుని దేవాలయం సమీపంలో మంటలు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి గుట్టపై మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. గట్టుపై గల కాలభైరవుని ఆలయం సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, కొబ్బరి చిప్పలకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో భక్తులు ఆందోళన చెందారు. ఆ సమయంలో ఆలయ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో భక్తులు, దుకాణదారులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. దుకాణదారులు ఆలయ ఈఓకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయగా.. ఆయన అక్కడకు చేరుకుని అందరి సహాయంతో మంటలను ఆర్పివేయించారు. కాగా నెల రోజుల క్రితం కూడా రాత్రి సమయంలో గుట్టపై మంటలు చెలరేగినట్లు భక్తులు తెలిపారు. ఆ సమయంలో ఫైరింజన్ సహాయంతో మంటలు ఆర్పినట్లు పేర్కొన్నారు. కొబ్బరిచిప్పల కాంట్రాక్టర్ చిప్పలను గుట్ట కిందకు తరలించకుండా అక్కడే వేయడంతో పాటు సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతోనే ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినట్లు భక్తులు పేర్కొన్నారు.

అరెస్టయిన వారిలో రైతులు లేరు

- భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర



మాట్లాడుతున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని గత నెల 30న యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయగా, వారిలో రైతులు ఎవరూ లేరని భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర అన్నారు. మంగళవారం రాత్రి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆందోళన చేసిన వారిలో నలుగురిని అరెస్టు చేశామని, వారిలో జమ్మాపురంలోని ఓ కంపెనీలో పనిచేసే వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు కొనుగోలు చేసిన తన 20 గుంటల భూమిలో కొంత రీజినల్ రింగ్ రోడ్డులో పోతుండడంతో ఆందోళనలో పాల్గొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిందని పేర్కొన్నారు. మిగతా వారు రైతులు కాదని అన్నారు. సహజంగా నేరస్తుల ప్రవర్తనను బట్టి వారిని ఎంత మంది బందోబస్తు నడుమ తీసుకెళ్లాలో నిర్ణయించబడుతుందని అన్నారు. ఈ మేరకు రిమాండ్‌లో ఉన్న నలుగురు రైతులను మంగళవారం నల్లగొండ నుంచి భువనగిరి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో ప్రొటోకాల్ పాటించాల్సి వచ్చిందన్నారు. వీరిని కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో ఎస్కార్ట్ సిబ్బందిని కూడా ఇబ్బంది పెట్టినట్లు తెలిసిందన్నారు. అయినప్పటికీ మీడియాలో వస్తున్న అభ్యంతరాలను దృష్టి ఉంచుకొని బందోబస్తులో ఉన్న పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

గిరిప్రదక్షిణ రోడ్డుకు మరమ్మతులు

- యాదగిరికొండ దిగువన ఫుట్‌పాత్ టైల్స్ నిర్మాణం
- వర్షం, డ్రెయినేజీ నీరు సాఫీగా వెళ్లేలా పనులు



గిరి ప్రదక్షిణ రోడ్డులో వేస్తున్న డ్రెయినేజీ పైప్‌లైన్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండకు దిగువన ఉన్న గిరి ప్రదక్షిణ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రతి నెలలో వచ్చే స్వామివారి జన్మనక్షత్రం రోజున యాదగిరిగుట్ట పట్టణంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల భక్తులు గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. గతంలో ఈ రోడ్డంతా మట్టి, గుంతలు, రాళ్లు, రప్పలతో ఉండేది. భక్తుల ఇబ్బందులను గమనించిన ఆలయాధికారులు 4కిలో మీటర్లకు పైగా ఫుట్‌ఫాత్ టైల్స్ వేస్తున్నారు. గకొండపైన వర్షం, డ్రెయినేజీ నీరు కిందకు వచ్చే క్రమంలో గిరి ప్రదక్షిణ రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో పాటు దుర్వాసన వస్తోంది. దీంతో అటు గిరి ప్రదక్షిణ చేసే భక్తులు, అక్కడే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపై నుంచి వచ్చే నీరు నేరుగా ప్రధాన రహదారికి అనుకొని ఉన్న డ్రెయినేజీలోకి వెళ్లే విధంగా పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణతో పాటు సైడ్ డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు వేగంగా పనులు చేయిస్తున్నారు.

అదును చూసి విత్తనాలు విత్తుకోవాలి

- పంటల సాగుపై నడిగూడెం ఏఓ రాజగోపాలరావు సూచనలు



దుక్కి దున్నుతున్న రైతు

నడిగూడెం : రైతు సాగు చేసే ఏ పంటకైనా అదునులోగా విత్తనాలు విత్తుకుంటే మేలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు చెబుతున్నారు. ఎక్కువ విసీర్ణంలో సాగు చేసే వరి, పత్తి పంటల విత్తనాలు విత్తుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటల సాగు, విస్తీర్ణం, దిగుబడులు నైరుతి రుతుపవనాల ప్రవేశంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ వారంలో ప్రవేశించి, మూడో వారం వరకు అంతటా విస్తరిస్తాయి. నైరుతి రుతుపవనాల ప్రవేశం ఆధారంగా వానాకాలంలో పత్తి, కంది, పెసర, ఇతర పంటలను విత్తుకుంటారు.

వర్షాలపై ఆధారపడి పత్తి సాగు

పత్తి విత్తనాలను వర్షాలపై ఆధారపడి విత్తుకోవాలి. తెల్లబంగారం సాగు చేసే రైతులు ఏటా అదే పొలంలో పత్తిని పండించకుండా పంట మార్పిడి చేయాలి. విత్తనాలను మొక్కకు మధ్య 2అడుగులు వరుస వరుసకు 2 అడుగులు లేదా మొక్కకు 3అడుగుల దూరంలో వరుస వరుసకు 3 అడుగుల దూరంలో విత్తుకోవడం ద్వారా సాంద్రతను పెంచి అధిక దిగుబడులు పొందవచ్చు. నల రేగడి భూముల్లో 60-70 మి.మీ. ఎర్ర చెల్క భూముల్లో 50-60 మి.మీ. వర్షపాతం నమోదైనప్పుడు విత్తుకోవాలి.



పాడి పంట

జూలై 15లోగా విత్తుకుంటే ఆశించిన దిగుబడులు పొందవచ్చు. సిఫారసు చేసిన భాస్వరం మొత్తాన్ని సింగిల్‌సూపర్ పాస్ఫేట్ రూపంలో 150కిలోలు ఆఖరు దుక్కిలో విత్తేటప్పుడు వాడాలి. మెగ్నీషియం, బోరాన్ తదితర సూక్ష్మదాతులోప నివారణకు మెగ్నీషియం పది గ్రాములు, బోరాన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు మందులైన ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రాములు లేదా థయోమితాక్సోం 4 గ్రాములు, తెగుళ్ల నివారణకు వినియోగించే ట్రైకోడెర్మా విరిడే 10 గ్రాములు, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 10 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ప్రైవేట్ హైబ్రిడ్ విత్తనాలైతే శిలీంద్రనాశిని మందులు కార్బెక్సిన్+థైరమ్ 25 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. అంతరపంటగా కందిని ఆరు లేదా ఎనిమిది వరుసలకు విత్తుకోవాలి.

వరి సాగుకు అనుకూలమైన సమయం

దీర్ఘకాలిక రకాలైన బీపీటీ-5204 ఇంకా ఇతర సన్న రకాలు ఇప్పటి నుంచి జూన్ నెలాఖరులోగా నారు పోసుకోవచ్చు. స్వల్పకాలిక రకాలైతే జూన్ 20నుంచి, జూలై 15వరకు నారు పోసుకోవచ్చు. ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం కొంత ఆలస్యమైనా పోసుకొనేందుకు అనువైంది.

జూలై 15లోగా విత్తుకోవాలి..

కంది, పెసర పంటలను ఈ నెల 15 నుంచి జూలై 15లోగా విత్తుకోవాలి. పంట మార్పిడి పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. కంది తర్వాత జొన్న, మినుము, ఉలువలు నువ్వులు తదితర పంటలు సాగు చేసుకోవచ్చు. పురుగులు, తెగుళ్ల తట్టుకొనే రకాలు సాగు చేసుకోవాలి. కంది పంట చుట్టూ అక్కడక్కడ బంతి మొక్కలు నాటుకోవాలి. బంతి పూలకు శనగ పచ్చ పురుగు ఆకర్షణ చెంది పూలపై గుడ్లను పెడుతుంది. మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటలు సాగు చేసేవారు జూలై 15 లోగా విత్తుకోవడం పూర్తి చేసుకోవాలి.